క్లుప్తంగా

శాంతి, భద్రతలపై ప్రత్యేక శ్రద్ధ



ఎమ్మెల్యే కరణానికి పూల మొక్క ఇస్తున్న డీఎస్పీ ప్రసాదరావు

చీరాల: నియోజకవర్గంలో శాంతి, భద్రతలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి డీఎస్పీకి సూచించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నూతనంగా విధులు స్వీకరించిన చీరాల డీఎస్పీ ప్రసాదరావు ఎమ్మెల్యే బలరామ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో దొంగతాలు, ట్రాఫిక్ వంటి పలు సమస్యలు రాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు వారి సమస్యల మీద పోలీస్ స్టేషన్‌లకు వచ్చే వారికి సత్వరం న్యాయం జరిగేలా చూడాలన్నారు.

పట్టా భూములు ఆక్రమిస్తే చర్యలు



స్పందన అర్జీలపై విచారణ చేస్తున్న తహసీల్దార్

బల్లికురవ: పిత్రార్జితంగా సంక్రమించిన పట్టా భూములను ఆక్రమించటం చట్టరీత్యా నేరమని తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి హెచ్చరించారు. మండలంలోని చినఅంబడిపూడి గ్రామానికి చెందిన కొవ్వూరి పద్మ సర్వే నంబర్ 549/3ఏ లో 18 సెంట్ల పట్టా భూమి పిత్రార్జితంగా సంక్రమించగా పట్టాదారు పాస్ పుస్తం, రికార్డులో పేరు ఉన్న ఆక్రమించుకున్నారని ఇటీవల స్పందనలో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు శనివారం సాయంత్రం తహసీల్దార్ మండల సర్వేయర్ రాజు రికార్డులతో భూమిని పరిశీలించారు. సర్వే చేయించి మీ పట్టా భూమిని అప్పగిస్తామని తహసీల్దార్ ఆమెకు హామీ ఇచ్చారు.

రెండు బైకులు ఢీ-ముగ్గురికి గాయాలు



కాలు విరిగిన వెంకట్రావు

జే.పంగులూరు: ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొట్టుకోవడంతో ముగ్గురికి గాయలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని పంగులూరు మార్కెట్ యార్డు వద్ద శనివారం చోటుచేసుకుంది. 108 సిబ్బంది సమాచారం మేరకు.. బూదవాడ గ్రామానికి చెంది తన్నీరు అనీల్ తన బైక్‌పై చిన్నమల్లవరం వైపు వస్తున్నాడు. ఈక్రమంలోనే మల్లవరం గ్రామం నుంచి మల్లవరపు వెంకట్రావు అతని తండ్రి కోటిలింగం బైక్‌పై పంగులూరుకు బయలుదేరారు. సరిగా పంగులూరు మార్కెట్ వద్దకు వచ్చేసరికి రెండు బైకులు ఎదురెదురుగా ఢీ కొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో తన్నీరు అనీల్ కాలికు గాయం కాగా, మల్లవరపు వెంకట్రావు కాలు విరిగింది, కోటిలింగానికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పంగులూరు 108 సిబ్బంది పైలెట్ ఎం వాసు, ఈఎస్‌పీ వై కిరణ్ క్షతగాత్రులను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనా స్థలాన్ని ఎస్సై తిరుపతిరావు పరిశీలించారు.

8 నుంచి గ్రంథాలయంలో వేసవి శిక్షణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథులు

చీరాల అర్బన్: పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని ఈనెల 8వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు లైబ్రేరియన్ డీ.ధనమ్మ తెలిపారు. శిక్షణ శిబిరానికి సంబంధించిన వాల్‌పోస్టర్ శనివారం గ్రంథాలయంలో ఆవిష్కరించారు. జిల్లాలోని అన్ని శాఖ గ్రంథాలయాల్లో పాఠశాల విద్యార్థులకు ఈనెల 8వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు 36 రోజులు పాటు శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చదవడం, రాయడం, వినడం, కథలు, కథనాలను, సృజనాత్మక కృత్యాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత రోజుల్లో విద్యార్థులు సెల్ ఫోన్లకు దగ్గరై చదువు పట్ల శ్రద్ధ తగ్గుతుందన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులను గ్రంథాలయాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో వలివేటి మురళీకృష్ణ, పవని భానుచంద్రమూర్తి, చుండూరి కృష్ణమూర్తి, సంకా చంద్రమౌళి, మునీరుల్లాఖాన్, చీరాల కృష్ణమూర్తి, రవీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పదిలో మెరిసిన ప్రభుత్వ విద్యార్థులు



తిమ్మాయపాలెంలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



చీరాల కేజీఎం స్కూల్ విద్యార్థిని భావనను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

- ఉత్తమ ఫలితాల బాటలో ప్రభుత్వ పాఠశాలలు
- సంతోషం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

అద్దంకి/అద్దంకి రూరల్/మేదరమెట్ల/బల్లికురవ/జే.పంగులూరు: విద్యార్థుల జీవితాల్లో తొలి అడుగు పదో తరగతి చాల కీలకపాత్ర వహిస్తుంది. మొదటి మెట్టే సరిగా పడితే భవిష్యత్‌లో శుభారంభం చేసినట్టే. ఇందుకు తగ్గట్లుగా శనివారం విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో విద్యార్థిని, విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. అందులో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా పదిలో ఉత్తమ ఫలితాలు సాధించి మన్నలు అందుకున్నారు. అద్దంకి నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఫలితాల్లో మెరిశారు. పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ బాలికల పాఠశాలలో 150 మందికి 115 మంది పాసయ్యారు. తిమ్మాయపాలెం పాఠశాలలో 152 మందికి 122 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం మండలంలో 708 మందిలో 400 మంది బాలికలు, 308 మంది బాలురు ఉత్తీర్ణులైనట్లు ఎంఈవో తెలిపారు.

☛ సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు పాఠశాలలో 90 మంది విద్యార్థులకు గాను 67 మంది, మక్కెనవారిపాలెంలో 73మంది, చవిటిపాలెంలో 36 మంది, కుందర్రులో 36 మంది, వెల్లలచెరువులో 21, సజ్జాపురంలో 16, సంతమాగులూరులో 52 మంది, కేజీబీవీలో 27, మిన్నెకల్లులో 10 మంది ఉత్తీర్ణులయ్యారని ఎంఈవో తెలిపారు. మొత్తం 679 మంది పరీక్ష రాయగా వారిలో 515 మంది ఉత్తీర్ణులయ్యారు.

☛ కొరిశపాడు మండలంలోని 10 పాఠశాలల్లో 485 మంది పరీక్ష రాయగా 431 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 205 మంది బాలికలు, 223 మంది బాలురు ఉన్నారు.

☛ అద్దంకి మండలం తిమ్మాయపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభచాటారు. 80.3 శాతం ఉత్తీర్ణత శాతంతోపాటు, 23 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు. వీరందరిని పాఠశాల హెచ్‌ఎం కేవీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

☛ జే.పంగులూరు మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పదిలో అద్భుత ఫలితాలు సాధించారు. చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 10వ తరగతి విద్యార్థులు 125 మందికిగాను 114 మంది పాసయ్యారు. వారిలో 13 మంది 550పై మార్కులు సాధించారు. 36 మంది 500 మార్కులు పైన మార్కులు సాధించారు. పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 66 మంది విద్యార్థులకు గాను 55 మంది విద్యార్థులు ఉతీర్ణులయ్యారు. వారిలో 500 పైన మార్కులు వచ్చిన విద్యార్థులు 15 మంది ఉన్నారు.

☛ బల్లికురవ పదోతరగతి ఫలితాల్లో మండలంలోని తొమ్మిది పాఠశాలల్లో బాలికలు 68 శాతం, బాలురు 54 శాతం మొత్తం మీద 61 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో వీరరాఘవయ్య తెలిపారు.

ఉపాధ్యాయుల కృషి.. విద్యార్థుల్లో ఫలితం.

వేటపాలెం/చీరాల అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. వేటపాలెం మండలం పందిళ్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 79 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 60 మంది ఉత్తీర్ణతో 76 శాతం సాధించారు. దేశాయిపేట జెడ్పీ హైస్కూల్లో 13 మందికిగాను తొమ్మిది, కొత్తపేట జెడ్పీ స్కూల్లో 192 మంది విద్యార్థుల్లో 124 మంది, అక్కాయిపాలెం జెడ్పీ స్కూల్‌లో 29 మందికి గాను 11 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎంజీపీఏపీ బీసీ డబ్ల్యూఎం హైస్కూల్‌లో 72 మందికిగాను 64 మంది, వేటపాలెం జెడ్పీ బాలికల హైస్కూల్లో 169 మంది పరీక్షలకు హాజరు కాగా 86 మంది ఉత్తీర్ణత సాధించారు.

☛ చీరాల కస్తూరిబా గాంధీ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల మండల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. అలానే చీరాల మండలంలోని ఈపూరుపాలెం జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు రెండు, మూడు స్థానాల్లో విద్యార్థులు నిలిచారు. కేజీఎం బాలికోన్నత పాఠశాల అత్యధికంగా 71.43 శాతం ఉత్తీర్ణత శాతం సాధించింది. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మొదటి మూడు స్థానాలు సాధించిన భావన, హర్షిణి, జానకిలను హెచ్‌ఎం కృష్ణమోహన్, ఉపాధ్యాయులు జయచంద్రబాబు, వెంకటేశ్వరబాబు, ప్రభాకరరావులు అభినందించారు. ఈపూరుపాలెంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 14 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. మొత్తం 81 శాతం ఉత్తీర్ణత శాతం సాధించారు. ఈపూరుపాలెం జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 24 మంది విద్యార్థినులు 500కు పైగా మార్కులు సాధించారు. అలానే పట్టణంలోని విజ్ఞాన భారతి హైస్కూల్, శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థినులు పాఠశాలల ఉపాధ్యాయులు, ఎంఈవో డి.నాగేశ్వర రావు అభినందించారు.

పదిలో బాలికలదే హవా..

కారంచేడు/చినగంజాం/యద్దనపూడి/మార్టూరు: పదో తరగతి ఫలితాల్లో మరోసారి విద్యార్థినులు సత్తా చాటారు. కారంచేడు మండలంలో బాలికల హవానే కనిపించింది. మండలంలోని కుంకలమర్రు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు 53 మందిలో 33 మంది, కొడవలివారిపాలెం ఉన్నత పాఠశాలలో 18 మందికిగాను 14 మంది యర్రంవారిపాలెం ఉన్నత పాఠశాలలో 27 మందలో 22 మంది, స్వర్ణ ఉన్నత పాఠశాలకు చెందిన 33 మందికి గాను 21 మంది ఉత్తీర్ణులయ్యారు.

☛ పది పరీక్ష ఫలితాల్లో యద్దనపూడి మండలంలో 83.9 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో పుల్లెల సుబ్రమణ్యేశ్వరావు తెలిపారు. మొత్తం 281 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 236 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. అనంతవరం పాఠశాలలో 88.88 శాతం, యద్దనపూడి 80, గన్నవరం 59, పూనూరు 85.9, జాగర్లమూడి 76, పోలూరు 70, బాలికల గురుకుల పాఠశాల 94.7 శాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను, అందుకు బాధ్యతగా విధులు నిర్వహించిన ఉపాధ్యాయులను జెడ్పీటీసీ చుండి లక్ష్మీనారాయణమ్మ, ఎంపీడీవో కృష్ణకుమారి, తహసీల్దారు వెంకటరెడ్డి, ఎంఈవో సుబ్రమణ్యేశ్వరావు అభినందించారు.

☛ పది పరీక్ష ఫలితాల్లో చినగంజాం జెడ్పీ హైస్కూల్‌లో 80 శాతం ఉత్తీర్ణులు కాగా, పెదగంజాం జెడ్పీ హైస్కూల్ 72 శాతం సాధించారు. కడవకుదురు జెడ్పీ హైస్కూల్ 75 శాతం, రాజుబంగారుపాలెం జెడ్పీ హైస్కూల్ 78 శాతం, అడివీధిపాలెం జెడ్పీ హైస్కూల్ 58 శాతం, పెద్దపల్లెపాలెం జెడ్పీ హైస్కూల్ 81 శాతం, కేజీబీవీ బాలికలు 82 శాతం, సత్యం ప్రైవేటు హైస్కూల్ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు.

☛ ఇంకొల్లు మండలంలోని డ్రీమ్స్, యూనివర్సల్ హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరచి తమ సత్తాను చాటారు. విద్యాసంస్థల అధినేత పేర్ని రాధాకృష్ణమూర్తి, కరస్పాండెంట్ సతీష్‌చంద్రలు విద్యార్థులను అభినందించారు. నివేదిత హైస్కూల్‌లో వందశాతం ప్రతిభ కనబరచారు

☛ ఇంకొల్లు జెడ్పీ హైస్కూల్ నందు విద్యార్థులు 62.24 శాతం మంది, పావులూరు జెడ్పీ హైస్కూల్ నందు 92.31 శాతం, దుద్దుకూరు జెడ్పీ హైస్కూల్ నందు 69.56 శాతం, గంగవరం ఎస్‌వీకే హైస్కూల్ 58 శాతం, పూసపాడు ఎస్‌కేవీఎస్ హైస్కూల్‌లో 72 శాతం, ఇడుపులుపాడు విద్యాపరిషత్ హైస్కూల్ 70.96 శాతం, ఇంకొల్లు ఎస్ఆర్ అండ్ వీఎస్ఆర్ గరల్స్ హైస్కూల్ 80 శాతం సాధించారు.

☛ పర్చూరు మండలంలో మొత్తం తొమ్మిది ప్రభుత్వ పాఠశాలలుండగా వాటిలో అన్నంబొట్లవారిపాలెం జెడ్పీ హైస్కూల్ 52 శాతం, అడుసుమల్లి జెడ్పీ హైస్కూల్ 68 శాతం, చెరుకూరు జెడ్పీ హైస్కూల్ 76 శాతం, ఉప్పుటూరు జెడ్పీ హైస్కూల్ 46 శాతం, వీరన్నపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 50 శాతం, పర్చూరు వైఆర్ హైస్కూల్ 61 శాతం, చెరుకూరు వైకేఎంఆర్ హైస్కూల్ 50 శాతం, నాగులపాలెం గరల్స్ హైస్కూల్ 97 శాతం, పర్చూరు బాలుర రెసిడెన్షియల్ స్కూల్ 47 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కరణం బలరాం

- పలు వార్డులను పరిశీలించిన ఎమ్మెల్యే కరణం

చీరాల: అభివృద్ధి పనుల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అధికారులను హెచ్చరించారు. శనివారం ఎమ్మెల్యే 6,9,31,32,33 వార్డుల్లో పర్యటించి నిర్మాణంలో ఉన్న రోడ్లు, డ్రైనేజీలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులను వివిధ రకాల నిధుల ద్వారా పెద్ద ఎత్తున రోడ్లు, డ్రైన్‌లు, వీధిలైట్లు వంటి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశామన్నారు. వాటిని త్వరగా పూర్తి చేయాలని లేకుంటే సహించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. చాలా ప్రాంతాల్లో మురుగు నీరు సక్రమంగా పారుదల కావడం లేదని డ్రైనేజీ నిర్మాణాల్లో లోపమే ఇందు కారణమన్నారు. త్వరగా పనులు పూర్తి చేస్తే మరలా ప్రభుత్వ నుంచి నిధులు తీసుకొచ్చి చీరాల పట్టణాన్ని మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషిచేస్తానన్నారు. ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కౌన్సిలర్లు మామిడాల రాముడు, కీర్తి వెంకట్రావు, బత్తు అనిల్, గొట్టిపాటి ఎమినేజర్, గోలి జగదీష్, నాయకులు కోశా శివ, కొల్లూరి అనిల్, కే విజయప్రకాశ్, షేక్ రియాజ్, దుడ్డు సైమన్, టీ సుదీర్, శ్రీదర్, గోలి గిరి, మున్సిపల కమీషనర్ కే రామచంద్రారెడ్డి, డీఈ ఏషయ్య, ఏఈ కట్టా రవి, తదితరలు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధే లక్ష్యం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి

మార్టూరు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల కనీస అవసరతలకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధి కోసం ఎంత ఖర్చుకు అయినా వెనుకాడబోమని పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ పేర్కొన్నారు. మండలంలోని రాజుగారిపాలెంలో శనివారం రాత్రి పర్యటించిన ఆయన స్థానికులతో మాట్లాడారు. గ్రామ సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతి రాజు, ఎంపీటీసీ కళ్లేపల్లి శ్రీనివాసరాజుల ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆమంచికి ఘన స్వాగతం పలికారు. గ్రామ నడిబొడ్డున ఉన్న దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి స్థానిక నాయకులతో కలసి ఆమంచి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో రూ.10 లక్షల వ్యవయంతో నిర్మాణాలు పూర్తి చేసుకున్న సీసీ రోడ్డుతో పాటు, మరో రూ.10 లక్షలతో నిర్మించిన డ్రైనేజ్ కాలువలను ఆమంచి ప్రారంభించారు. అనంతరం గ్రామ శివారులో రూ.6 లక్షల వ్యవయంతో నిర్మించిన గ్రావెల్ లింక్ రోడ్డును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పఠాన్ కలేషావలీ, బాబూ నాయక్, గన్నెపూడి రవిచంద్, గడ్డం మస్తాన్‌వలీ, అట్లూరి సుగుణరావు, జంపన వీరయ్య చౌదరి, సులేమాన్, మస్తాన్, చిన్న బుడే, స్థానికులు పాల్గొన్నారు.

ఆలయ ధ్వజస్తంభం తొలగింపు

వేటపాలెం: స్థానిక చెన్నకేశవస్వామి దేవస్థానం ముందు గల పురాతన ధ్వజ స్తంభం శిథిలావస్థకు చేరడంతో శనివారం తొలగించారు. ముందుగా ఆలయంలో పూజారులు హనుమాచార్యులు, డీవీ చక్రవర్తి, ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో సీహెచ్ వేణుగోపాలరావు మాట్లాడుతూ 1982లో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారని తెలిపారు. అయితే కాలానుగుణంగా ధ్వజ స్తంభం చెక్క శిథిలావస్థకు చేయడంతో దాన్ని తొలగించారని చెప్పారు. దీని స్థానంలో నూతంగా ఈ నెల 31న కొత్తది ప్రతిష్ఠిస్తామని తెలిపారు.



ధ్వజస్తంభం తొలగింపును పర్యవేక్షిస్తున్న ఈవో కుమార్

కార్యక్రమంలో ఈవో జీవీఎల్ కుమార్, పోతిన శ్రీనివాసరావు, వీఆర్‌ఓ సత్యనారాయణ, పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా భీమలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

జే.పంగులూరు: మండలంలోని పంగులూరు గ్రామంలోని భీమలింగేశ్వరస్వామి 19 వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. చివరి రోజు అయిన శనివారం స్వామి వారిని గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో వేలాది మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఒంగోలు వారికి భరత నాట్యం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఏపీ శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్య పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజారులు కృష్ణచైతన్యకు శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాయిణి వెంటక సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దొనకొండలో దొంగలు హల్‌చల్

దొనకొండ: వారం రోజులుగా దొనకొండలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని ఓ వీధిలో ఎగ్గోని కోటయ్య ఇంట్లో దొంగలు పడి సుమారు రూ.2 లక్షలు దోచుకున్నారు. ఎగ్గోని కోటయ్య గత ఆదివారం కుటుంబ సమేతంగా హైదరాబాద్ వెళ్లారు. శనివారం ఉదయం దొనకొండకు చేరుకున్నారు. ఇంట్లోకి వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు తీసి ఇంట్లోకి ప్రవేశించి బీరువా పగుల గొట్టి నగదు ఎత్తుకెళ్లారు. ఎస్‌ఐ యం.సైదు బాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

కృత్రిమ గర్భధారణతో మేలైన పశుసంపద



కృత్రిమ గర్భధారణ విధానాన్ని పరిశీలిస్తున్న సోమశేఖర్

యద్దనపూడి: మేలు జాతి పశుసంపద అభివృద్ధికి కృత్రిమ గర్భధారణ పద్ధతిని అనుసరిస్తున్నట్లు చదలవాడ పశుక్షేత్ర వైద్యాధికారి ఎమ్. సోమశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో పిండమార్పిడి విధానం ద్వారా ఆవు గర్భంలో ఒంగోలు జాతి వీర్యంతో కృత్రిమ గర్భధారణ పద్ధతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక పాల దిగుబడులను ఇచ్చే ఆంబోతుల వీర్యాన్ని సేకరించి నిక్షిప్తం చేసిన తరువాత ఎదకు వచ్చిన పశువుల గర్భంలోకి కృత్రిమ పద్ధతుల్లో వీర్యాన్ని పంపించటం ద్వారా మేలుజాతి దూడలను పుట్టించటమే కృత్రిమ గర్భధారణ విధానమన్నారు. ఈ విధానం ద్వారా నూటికి 90 శాతం ఆడదూడలు పుట్టేలా చేయటమే లక్ష్యమన్నారు. తద్వారా పాడిరైతును ఆర్థికంగా బలోపేతం చేయటమే కాక పశుసంపద గణనీయంగా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ బీ. సురేష్, డాక్టర్ క్రాంతి కిరణ్, పి. శారదా, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా శిడిమాను ఉత్సవం



శిడిమాను ఉత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

చీరాల అర్బన్: చీరాల మండలం వాడరేవు గ్రామంలో శనివారం పోలేరమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా శిడిమాను ఉత్సవాన్ని నిర్వహించారు. శిడిమాను మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గత ఐదు సంవత్సరాలుగా అమ్మవారి జాతర ఊరేగింపును నిర్వహిస్తున్నామని ఆలయ కమిటి అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా వెలసిన అమ్మవారిని భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దోకి బ్రహ్మనందరెడ్డి, నక్కా శ్రీనివాసరెడ్డి, అక్కల శ్రీనివాసరెడ్డి, మారుబోయిన ప్రేమ్‌చంద్‌రెడ్డి, గ్రామ కాపులు మున్నం సత్యనారాయణరెడ్డి, దోకి వెంకటేశ్వరరెడ్డి, మారుబోయిన పోలిరెడ్డి, నక్కా నాగేశ్వరరెడ్డి, రాజు నాగేశ్వరరెడ్డి, మున్నం సుబ్బారెడ్డి, నక్కా మస్తాన్‌రెడ్డి, మారుబోయిన వెంకటరెడ్డి, పల్లిబోయిన పున్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది



నాగరాజుపల్లిలో మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏవో

అద్దంకి రూరల్: అకాల వర్షాలకు తడిసిన మొక్కజొన్న పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకట కృష్ణ శనివారం తెలిపారు. ఈ నెల 13 తేదీలోపు ఈ-కాప్ నమోదు చేసుకున్న రైతులందరూ రైతు భరోసా కేంద్రం వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. క్వింటాల్ రూ.1960 మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

మార్టూరు: రైతు బరోసా కేంద్రం ద్వార మొక్కజొన్న కొలుగోలు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినందున సంబంధిత రైతులు స్థానిక ఆర్‌బీకే సెంటర్ల ద్వార రిజిస్ట్రేషన్‌లు చేసుకోవాలని ఏవో కిరణ్‌కుమార్ తెలిపారు. నాగరాజుపల్లి గ్రామంలో వర్షానికి తడిసిన పంటను ఆయన పరిశీలించారు. మొక్కజొన్న కోతల దశలో ఉన్నందున వర్షపునీటిని పిల్ల కాలువల ద్వారా బయటకు పంపించాలన్నారు.

శింగరకొండ దర్శిని



అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం. ఉత్తరాయణం వైశాఖ మాసం అనూరాధ నక్షత్రం విదియ తిథి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శనివారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.